
సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 8 । ఏప్రిల్ । 2024



గుడ్డుకు వడగాడ్పు

చండప్రచండంగా చెలరేగిపోతున్న మార్తాండుడి ప్రభావంతో పౌల్ట్రీ పరిశ్రమ 'గుడ్లు' తేలేస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. - IIలో▸



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు డెల్టాకు 1,800, మధ్య డెల్టాకు 1,300, పశ్చిమ డెల్టాకు 3,300 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ (సా॥)	సెహరీ మంగళ (ఉ॥)
రాజమహేంద్రవరం	6.26	4.30
కాకినాడ	6.25	4.30
అమలాపురం	6.25	4.28

న్యూస్‌రీల్

కోటసత్తెమ్మ సన్నిధికి భక్తుల తాకిడి



నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా దేవస్థానానికి రూ.1,02,053 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు.

ఆన్‌లైన్ మందుల విక్రయాన్ని అడ్డుకుంటాం



ఎంపీ భరత్‌రామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న డ్రగ్స్ అసోసియేషన్ నాయకులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆన్‌లైన్ మందుల విక్రయం ద్వారా ప్రజలకు నష్టం చేసే మత్తుమందులు విపరీతంగా వినియోగిస్తున్నారని, దీనిని అడ్డుకునేందుకు తమతో పాటు జాతీయ స్థాయి డ్రగ్స్ ట్రేడ్ అసోసియేషన్ కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు రాయపూడి శ్రీనివాసరావు అన్నారు. గత నెల 10న జరిగిన జిల్లా డ్రగ్స్ ట్రేడ్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన ప్యానెల్ ప్రమాణ స్వీకారోత్సవం కొంతమూరు నాలుగో బ్రిడ్జి వద్ద ఉన్న వెంకటాద్రి గార్డెన్స్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అల్‌ప్రాజోమ్ వంటి మత్తు మందులను డాక్టర్ చీటీతో మాత్రమే విక్రయించాలని, కానీ, అవి నేడు ఆన్‌లైన్ మార్కెట్‌లో విరివిగా లభిస్తున్నాయని చెప్పారు. కార్పొరేట్ మందుల వ్యాపారం పెరిగిపోయిందని, వారు అధిక శాతం డిస్కౌంట్లు ఇస్తుండడంతో సాధారణ మందుల దుకాణదారులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. మందుల దుకాణదారులకు తప్పనిసరిగా ఏసీ, 24/7 ఫ్రిజ్ ఉండాలని, దీనివలన విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మందుల దుకాణాలకు గృహావసరాల విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్‌కు ఇండియన్ ఫార్మాస్యూటికల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ, సడ్డా రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రత్నం వినతిపత్రం అందజేశారు. మందుల వర్తకుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని భరత్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి పిండి గణపతి, కోశాధికారి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



జిల్లా చదరంగం పోటీల్లో విజేతలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యాన స్థానిక గాంధీపురంలోని శ్రీ గౌతమి స్మార్ట్ స్కూల్‌లో అండర్–17 బాల, బాలికల జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో 65 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో జరిగిన ఆరు రౌండ్లలో ఎం.రామచరణ్ తేజ్, ఎ.భాస్కర్ రత్నషణ్ముఖ్ విజయం సాధించారు. బాలికల విభాగంలో జరిగిన ఐదు రౌండ్లలో నేహశ్రీ, అక్షయ విజయం సాధించారు. విజేతలు ఈ నెల 20 నుంచి గుడివాడలో జరిగే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో మన జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు.

రూ.1.18 లక్షల విరాళం

గోకవరం: సనాతన ధర్మ ప్రబోధనా సమితి ఆధ్వర్యాన గోకవరం శివారున నిర్మిస్తున్న శ్రీ స్కంద బాలాజీ సూర్య దేవాలయానికి గ్రామానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ సుంకవల్లి వెంకట్రావు, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు లక్ష్మీబాయి దంపతులు ఆదివారం రూ.1.18 లక్షలు విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, స్థల దాత అక్షింతల రాజా, ఇతర సభ్యులకు అందజేశారు.

సకుటుంబ సపరివార సమేతంగా..

- ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు బంధుగణం తోడు
- గడప గడపనూ తడుతున్న వైనం
- మనసారా స్వాగతిస్తూ అభిమానం చాటుకుంటున్న ప్రజలు



ఎంపీ, రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్‌కు మద్దతుగా ఏవీ అప్పారావు రోడ్డులో ప్రచారం చేస్తున్న ఆయన సతీమణి మోన



రాష్ట్ర మంత్రి, అభ్యర్థి చెల్లుబోయిన వేణుకు మద్దతుగా ధవళేశ్వరంలో ఆయన తనయుడు ఉమాశంకర్ ప్రచారం



నిడదవోలు అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడుకు మద్దతుగా ప్రచారంలో తనయుడు వరుణ్‌సాయి



గోపాలపురం సిట్టింగ్ ఎమ్మెల్యే, కొవ్వూరు అభ్యర్థి తలారి వెంకట్రావుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఆయన కుమార్తె శాలిని, సోదరి స్వర్ణలత



రాజానగరం సిట్టింగ్ ఎమ్మెల్యే, అభ్యర్థి జక్కంపూడి రాజాకు మద్దతుగా చేపట్టిన ప్రచారంలో ఆయన భార్య రాజశ్రీ



అనపర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే, అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విజయం కోసం సతీమణి ఆదిలక్ష్మి ప్రచారం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సార్వత్రిక ఎన్నికలకు మరో ఐదు వారాలు మాత్రమే గడువు ఉండటంతో ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం హోరెత్తిస్తున్నారు. అనుచర గణంతో మాత్రమే కాకుండా సకుటుంబ బంధుమిత్ర సపరివారంగా ప్రచార పర్వం కొనసాగిస్తున్నారు. 'తూర్పు' తెల్లవారింది మొదలు.. అభ్యర్థులతో పాటు వారి గెలుపే లక్ష్యంగా కుటుంబ సభ్యులు ప్రచార పర్వంలో పరుగులు తీస్తున్నారు. ఈ విషయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సహా మిగిలిన పార్టీల కంటే వైఎస్సార్ సీపీ ముందంజలో కనిపిస్తోంది. ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, అభ్యర్థులు, నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ఇప్పటికే ప్రతి ఊరునూ చుట్టి వచ్చేశారు. ఇప్పుడు మరోసారి ప్రతి ఇంటికీ సకుటుంబ సమేతంగా వెళ్తూ స్థానికులను పేరుపేరునా పలకరిస్తూ, బంధుత్వాలు, స్నేహబంధాలు గుర్తు చేస్తూ, ఆత్మీయంగా పలకరిస్తూ ప్రజలకు దగ్గరవుతున్నారు. గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని గణాంకాలతో సహా వివరిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. గడప గడపనూ తడుతూ, ప్రజల మనసుల్ని చూరగొంటున్నారు. వారికి మద్దతుగా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మూడు వంతుల మంది అభ్యర్థులకు మద్దతుగా వారి కుటుంబ సభ్యులు పోటాపోటీగా ప్రచారంలో కొత్తదనాన్ని నింపుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని మండలాలను మూడు నాలుగు భాగాలుగా పంచుకుంటూ బృందాలుగా, విడివిడిగా ప్రచారం చేస్తున్నారు.

కాకినాడ జిల్లాలో..

- తుని నియోజకవర్గంలోని కోటనందూరు మండలం, తుని పట్టణంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి దాడిశెట్టి రాజా కుమారుడు శంకర్ మల్లిక్ ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. పద్దెనిమిదేళ్ల మల్లిక్ ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ప్రపంచ ప్రఖ్యాత ఎస్‌పీ జైన్ యూనివర్సిటీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ చదువుతున్నారు. మధ్యలో సెలవు పెట్టి తండ్రి రాజాకు మద్దతుగా ప్రజల మద్దతు కూడగడుతున్నారు.
- కాకినాడ రూరల్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి కురసాల కన్నబాబును ఆశీర్వదించాలని కోరుతూ ఆయన సతీమణి శ్రీవిద్య, తండ్రి సత్యనారాయణ, సోదరుడు, సినీ దర్శకుడు కల్యాణ్ కృష్ణ ప్రచారం చేస్తున్నారు.
- కాకినాడ సిటీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి మహాలక్ష్మి మండుటెండను సైతం లెక్క చేయకుండా ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. వైద్య వృత్తిలో ఉన్న కుమార్తెలు, అల్లుళ్లు కూడా ప్రచారం చేస్తున్నారు.
- జగ్గంపేటలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట నరసింహం విజయం కోసం ఆయన సతీమణి వాణి, కుమారుడు రామ్‌జీతో పాటు కోడలు శ్రీనిధి కూడా నియోజకవర్గ పల్లెల్లో కలియ తిరుగుతున్నారు. వాణి, శ్రీనిధి కొన్ని ప్రాంతాల్లో, నరసింహం, రామ్‌జీ కొన్ని గ్రామాల్లో పర్యటిస్తున్నారు. గతంలో మంత్రిగా చేసిన సేవలు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ మద్దతు కోరుతున్నారు.
- డీసీసీబీ చైర్మన్, ఎమ్మెల్యేగా ఉన్న పరిచయాలు, వయస్సు, అనుభవం వంటి అంశాలు ఉదహరిస్తూ వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సుబ్బారావును ఆశీర్వదించాలని కోరుతూ ఆయన సతీమణి వెంకటలక్ష్మి, కుటుంబ సభ్యులు ప్రచారం చేస్తున్నారు.
- పెద్దాపురంలో కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబుకు మద్దతుగా అమెరికాలో ఉంటున్న ఆయన కుమార్తె ప్రణవి స్వస్థలానికి వచ్చి ప్రచారం చేసి, మధ్యలో అమెరికా వెళ్లారు. దొరబాబుకు మద్దతుగా ఆయన తండ్రి, సీనియర్ నాయకుడు సుబ్బారావు కూడా ప్రచారం సాగిస్తున్నారు.

తూర్పు గోదావరిలో..

- రాజమహేంద్రవరం రూరల్‌లో వైఎస్సార్ సీపీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు మద్దతుగా ఆయన చిన్న కుమారుడు ఉమాశంకర్ ప్రచారం చేస్తున్నారు. మంత్రి సతీమణి వరలక్ష్మి, పెద్ద కోడలు ప్రవంతి కూడా ఉగాది నుంచి ప్రచారానికి సిద్ధమవుతున్నారు.
- ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను రాజామహేంద్రవరం సిటీ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఆశీర్వదించాలని కోరుతూ ఆయన సతీమణి మోన నగరంలో విస్తృత ప్రచారం సాగిస్తున్నారు.
- రాజానగరంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మరోసారి గెలిపించాలని కోరుతూ ఆయన తల్లి, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, సతీమణి రాజశ్రీ, సోదరుడు, పార్టీ యువజన విభాగం ప్రాంతీయ సమన్వయకర్త గణేష్ పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం ప్రజలతో మమేకమవుతున్నారు.
- అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి ఆదిలక్ష్మి మూడు వారాలుగా మహిళలతో కలసి ఇంటింటా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.
- నిడదవోలులో సిట్టింగ్ ఎమ్మెల్యే, అభ్యర్థి గెడ్డం **శ్రీనివాసనాయుడుకు మద్దతుగా తనయుడు వరుణ్‌సాయి ప్రచారంలో పాలు పంచుకుంటున్నారు. అమెరికాలో చదువుకుంటున్న వరుణ్‌సాయి తండ్రి విజయం కోసం రెక్కలు కట్టుకుని స్వస్థలానికి** వచ్చారు.
- కొవ్వూరులో గోపాలపురం సిట్టింగ్ ఎమ్మెల్యే, అభ్యర్థి తలారి వెంకట్రావును గెలిపించాలని కోరుతూ ఆయన కుమార్తె శాలిని, దేవరపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు, సోదరి స్వర్ణలత మండలాలను పంచుకుని ప్రచారం చేస్తున్నారు.

కోనసీమ జిల్లాలో..

- అమలాపురంలో మంత్రి పినిపే విశ్వరూప్‌కు మద్దతుగా ఆయన భార్య బేబీ మీనాక్షి ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి తదితర గ్రామాలు, తనయుడు శ్రీకాంత్ అల్లవరం మండలంలోని గ్రామాల్లో ఇంటింటా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. మీనాక్షి ఫౌండేషన్ ద్వారా బేబీ మీనాక్షి నియోజకవర్గ ప్రజలకు సుపరిచితురాలు కావడంతో ప్రచారంలో దూసుకుపోతున్నారు.
- రామచంద్రపురంలో కో ఆర్డినేటర్, వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ గెలుపు కోసం నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన ఆయన తండ్రి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ తన పరిచయాలను విస్తృతంగా వినియోగిస్తున్నారు.
- ఎమ్మెల్సీ, మండపేటలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు విజయం కోసం ఆయన తనయుడు పృథ్వీరాజ్ ప్రచారం చేస్తున్నారు. త్రిమూర్తులు పర్యటించే గ్రామాల్లో ముందు రోజు పృథ్వీరాజ్ పర్యటిస్తూ స్థానికుల మద్దతు కూడగడుతున్నారు.
- జెడ్పీ చైర్మన్‌గా పి.గన్నవరం నియోజకవర్గానికి పరిచయస్తులైన పి.గన్నవరం వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావుకు మద్దతు కూడగట్టడంలో ఆయన రెండో కుమారుడు రామ్మోహనరావు అహోరాత్రాలు శ్రమిస్తున్నారు. తండ్రి వెంట అంబాజీపేట, పి.గన్నవరం మండలాల్లో ప్రచారం చేస్తున్నారు. నీటిపారుదల శాఖలో ఎస్ఈ స్థాయిలో విప్పర్తి ఈ ప్రాంతానికి చేసిన సేవలను గుర్తు చేస్తూ ప్రజల మద్దతు కోరుతున్నారు.

రాజమహేంద్రికి సన్‌స్ట్రోక్

- నిప్పులు కురిపించిన సూర్యుడు
- 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



రాజమహేంద్రవరంలో దాదాపు నిర్మానుష్యంగా కనిపిస్తున్న హైటెక్ బస్టాండ్ సెంటర్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం నగరానికి ఆదివారం 'సన్' స్ట్రోక్ తగిలింది. ఈ సీజన్‌లోనే తొలిసారిగా అత్యధికంగా 45 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రెండు రోజులుగా 42 డిగ్రీలుగా ఉన్న ఉష్ణోగ్రత ఒక్కసారిగా మరో మూడు డిగ్రీలు పెరిగిపోవడంతో ప్రజలు అల్లాడిపోయారు. అధిక ఉష్ణోగ్రతలతో రాజమహేంద్రవరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు 'ఉక్క'రిబిక్కిరి అవుతున్నారు. సాయంత్రమైనా వేడి గాలులు తగ్గకపోవడంతో నానా ఇబ్బందులూ పడుతున్నారు. సాధారణంగా ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు మే నెల మధ్యలో అరుదుగా నమోదవుతూంటాయి. కానీ, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సూర్యుడు ముందుగానే చెలరేగిపోతున్నాడు. నెల రోజులు ముందుగానే ఇటువంటి వాతావరణం ఉంటే మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. ఎండల తీవ్రతకు జడిసి, ఉదయం 9 దాటిన తర్వాత ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. తప్పనిసరి పనులపై బయటకు వెళ్తున్నవారు గొడుగు, చేతిరుమాళ్లు, తువ్వాళ్లు వెంట తీసుకుని వెళ్లినా ఎండకు విలవిలలాడుతున్న పరిస్థితి. తిరిగి ఇల్లు చేరేదాకా తడారిపోతున్న గొంతులు తడుపుకొంటూ పనులు చక్కబెట్టుకుంటున్నారు. ఆస్పత్రుల్లో రోగుల వెంట ఉండే వారు చెట్ల కింద సేద తీరాల్సి వస్తోంది. చిరు వ్యాపారుల పరిస్థితి దారుణంగా తయారైంది. వేడి గాలులు తట్టుకోలేక తల్లడిల్లుతున్నారు. ద్విచక్ర వాహనదారులు రోడ్ల పక్కన చెట్ల నీడను ఆశ్రయిస్తూ, శీతల పానీయాలు, కొబ్బరి నీళ్లు తాగుతూ ఆపసోపాలు పడుతున్నారు. కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు జిల్లాలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, సీహెచ్‌సీలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే సంబంధిత ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

మంత్రి వేణు దెబ్బకు.. చీపురు పట్టిన గోరంట్ల



శాటిలైట్ సిటీ సి-బ్లాక్‌లో చీపురు పట్టిన గోరంట్ల

వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ పలు ప్రాంతాల్లో స్వచ్ఛత – మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. స్వయంగా పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు అనేక సంస్కరణలు చేపట్టారు. ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం ఇటువంటి బృహత్తర కార్యక్రమం చేపట్టిన మంత్రి వేణుపై నాడు 'చెత్త మంత్రి' అంటూ టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి నోరు పారేసుకున్నారు. ఇప్పుడు సీన్ రివర్స్ అయినట్టుంది. స్వయంగా ఆయనే నేడు మంత్రి వేణు బాటలో నడుస్తున్నారు. ఐదేళ్ల కాలంలో ప్రజల బాగోగులు పట్టించుకోని గోరంట్ల ఆదివారం ఉదయం శాటిలైట్ సిటీ సి–బ్లాక్‌లో 'గుడ్ మార్నింగ్‌తో మీ ఇంటికి మీ గోరంట్ల' అనే కార్యక్రమం నిర్వహించారు. ఓటర్లకు గాలం వేసేందుకు కుమార్తె కంఠంనేని శిరీషతో కలిసి చీపురు పట్టారు. కొద్దిసేపు ఇంటింటికీ తిరిగి దగ్గరలో ఉన్న పార్కును శుభ్రం చేసి మమ అనిపించారు. ఐదేళ్ల పాటు తమకు కనిపించని ఎమ్మెల్యే గోరంట్ల.. మంత్రి వేణు వచ్చాక గ్రామంలో మార్పు తీసుకుని రావడంతో.. ఇప్పుడు తప్పనిసరై ఓట్ల కోసం చీపురు పట్టారని స్థానికులు చెప్పుకొన్నారు. ఐదేళ్ల పాటు కనిపించని గోరంట్ల.. ఎన్నికలు రావడంతో పసుపు చొక్కాలు ధరించి మరీ వచ్చేశారా అని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– రాజమహేంద్రవరం రూరల్

వరివిగా దిగుబడి

- గోదావరి డెల్టాలో మొదలైన రబీ కోతలు
- మరో పది రోజులు నీరిస్తే చాలు
- 7.50 లక్షల ఎకరాల్లో వరి సాగు
- ఎకరాకు 45 నుంచి 55 బస్తాల వరకూ ధాన్యం దిగుబడి
- ప్రస్తుతం రోజుకు 6,200 క్యూసెక్కుల చొప్పున పంపిణీ
- ఎద్దడి రాకుండా సమగ్ర నీటి యాజమాన్యం



అత్రేయపురం మండలం లొల్ల వద్ద పండిన రబీ వరిచేలు (అంతరచిత్రం) అయినవిల్లి మండలం చింతలలంక లాకు

సాక్షి అమలాపురం: గోదావరి డెల్టాలో రబీ పంట పండింది. నదిలో సమృద్ధిగా సాగునీరు లేనందున నీటి ఎద్దడి తప్పదనుకున్నారు. అయితే అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా అవసరాల మేరకు సరఫరా చేయడం, లాకుల వద్ద వారాబందీ నిర్వహణ వంటి చర్యల ద్వారా అధికారులు రబీ ఆయకట్టుకు పూర్తిగా నీరందించారు. మెరక, శివారుల్లో అక్కడక్కడా.. అప్పుడప్పుడూ సాగునీటి ఎద్దడి ఏర్పడినప్పటికీ అధికారులు సకాలంలో చర్యలు తీసుకోవడంతో రబీ సాగునీటికి ఢోకా లేకుండా పోయింది. గోదావరి డెల్టాలోని రబీ వరి కోతలు ఆరంభమయ్యాయి. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా పరిధిలోని ఎగువ ప్రాంతాల్లో కోతలు జోరుగా సాగుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో రాజమహేంద్రవరం, అనపర్తి, కాకినాడ జిల్లా పరిధిలో సామర్లకోట, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆలమూరు, కొత్తపేట వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో వరి కోతలు ఆరంభమయ్యాయి. కోతలు జరిగిన ప్రాంతాల్లో సగటు దిగుబడి 50 బస్తాలు (బస్తా 75 కేజీలు, 37.5 క్వింటాళ్ల వరకు వస్తోంది. కొన్నిచోట్ల 55 బస్తాల వరకు దిగుబడి వస్తోంది. మరో పది రోజుల్లో రబీ కోతలు జోరందుకోనున్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో గోదావరి మూడు డెల్టాలలో అధికారుల లెక్కల ప్రకారం సుమారు 8.96 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగు జరుగుతోంది. వాస్తవ సాగు 7.50 లక్షల ఎకరాలు. రబీ ఆయకట్టుతో పాటు పారిశ్రామిక అవసరాలు, తాగునీరు కలిపి రబీ సీజన్‌లో కనీసం 90 టీఎంసీల నీరు అవసరం. రబీ సీజన్‌లో సహజ జలాలు తక్కువగా ఉంటాయని, ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు ఇవ్వలేమని సాగునీటిపారుదల శాఖ అధికారులు చెప్పారు. అయితే ప్రభుత్వ భరోసాతో మొత్తం ఆయకట్టుకు నీరిచ్చేందుకు అంగీకరించారు.

92.785 టీఎంసీల నీరు వినియోగం

రబీ సీజన్ మొదలైన తరువాత వరిసాగుతోపాటు పారిశ్రామిక అవసరాలు, తాగునీటికి కలిపి ఇప్పటి వరకు 92.785 టీఎంసీల నీటిని డెల్టా కాలువలకు విడుదల చేశారు. డిసెంబరు 7న రబీ షెడ్యూలు మొదలు కాగా ఈనెల 6వ తేదీ శనివారం ఉదయం వరకు తూర్పు డెల్టా కాలువకు 27.81 టీఎంసీలు, మధ్యడెల్టాకు 17.71, పశ్చిమ డెల్టాకు 47.265 టీఎంసీల చొప్పున నీటిని విడుదల చేశారు. ఈ కాలంలో సర్‌ప్లస్ ద్వారా దిగువకు 11.512 టీఎంసీల నీరు వదిలారు. మొత్తం మీద రబీ సీజన్‌లో ధవళేశ్వరం బ్యారేజీ వద్దకు 104.300 టీఎంసీలు రావడం గమనార్హం.

ఈ నెల 15వ తేదీ వరకు పంపిణీ

తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు సంబంధించి సాగునీటి పారుదల సలహా మండలి (ఐఏబీ)లో రబీ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం మార్చి 31 నాటికి కాలువలు మూసివేయాల్సి ఉంది. అయితే డెల్టాలో సాగు ఆలస్యం కావడం వల్ల మూడు డెల్టాలకు నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం తూర్పు డెల్టాకు 1,800, మధ్య డెల్టాకు 1,300, పశ్చిమ డెల్టాకు 3,100 చొప్పున మొత్తం 6,200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు అధికారులు సాగునీరందించేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే మున్సిపాలిటీలు, పంచాయతీల పరిధిలోని మంచి నీటి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపేందుకు అదనంగా మరికొద్ది రోజులు నీరందించే అవకాశముంది.

పూర్తి స్థాయిలో సాగు నీరు



సకాలంలో సాగు నీరు అందడంతో ఈ ఏడాది రబీ పంటలు ఆశాజనకంగా పండాయి. గతంలో సాగు నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. దాంతో పంటల దిగుబడులు తక్కువగానే వచ్చాయి. ఈ ఏడాది ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో సాగు నీరు అందింది. దీని వల్ల రబీ పంటలో 55 నుంచి 60 బస్తాలు ఎకరాకు పండే అవకాశం ఉంది.

– **యల్లమిల్లి రాంబాబు**, రైతు, గంగలకుర్రు

పోస్టల్ బ్యాలెట్‌పై 15న శిక్షణ



కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రతి ఓటరూ ఓటు వేయాలనే సంకల్పంతో ఎన్నికల విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్ ఇస్తున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి ఎన్నికల విధుల ఉత్తర్వులతో పాటు ముందస్తుగా ఫారం–12 కూడా అందిస్తున్నామన్నారు. దీనిని ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఆయా నియోజకవర్గాల స్థాయిలో ఈ నెల 15న తొలి శిక్షణ నిర్వహిస్తామన్నారు. ఆ సందర్భంగా ఫారం–12 నింపి, అందజేయాలని సూచించారు. ఏమైనా తప్పులు దొర్లితే వాటిని సరి చేస్తామన్నారు. శిక్షణ సందర్భంగా ఫెసిలిటేషన్ సెంటర్‌లో 10 టేబుళ్లు ఏర్పాటు చేసి, డేటా ఎంట్రీ ఆపరేటర్లను కేటాయిస్తామని తెలిపారు. వారి వద్దకు ఎన్నికల విధుల ఉత్తర్వులు, ఫారం–12, ఫొటో ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్) తీసుకుని వెళ్లి ఓటును నిర్ధారించుకోవాలని వివరించారు. అనంతరం నిర్దేశిత తేదీల్లో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లి నేరుగా ఓటు వేయవచ్చని తెలిపారు. తమ ఓటు ఎక్కడ, ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది, బూత్ లెవెల్ అధికారి ఎవరు, ఎపిక్ సంఖ్య వంటి వివరాలను ఓటర్లు తెలుసుకునేందుకు పబ్లిక్ పోర్టల్ ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ మాధవీలత వివరించారు.

క్లుప్తంగా

అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు బృందాలు

అమలాపురం టౌన్: ఎస్ఈబీ, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీలు జిల్లాలోని చెక్‌పోస్టులు, తదితర ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేసి అక్రమ మద్యం, నగదు, ఓటర్ల ప్రలోభ పెట్టే ఇతర వస్తువులను సీజ్ చేస్తున్నాయి. అమలాపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 9 నాన్ డ్యూటీ పెయిడ్ (ఎన్‌డీపీ) మద్యం సీసాలు, 1.62 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్)ను స్వాధీనం చేసుకున్నారు. నగరం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని నుంచి 6 ఎన్‌డీపీ సీసాలు, 1.08 లీటర్ల ఐఎంఎల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి నుంచి 300 లీటర్ల బెల్లపు ఊట స్వాధీనం చేసుకున్నారు. రామచంద్రపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని నుంచి 2 ఎన్‌డీపీ సీసాలు, 1.5 లీటర్ల ఐఎంఎల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముమ్మిడివరం, అలమూరు ప్రాంతాల్లో ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 25 ఎన్‌డీపీ సీసాలు, 4.50 లీటర్ల ఐఎంఎల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పిఠాపురం: అక్రమంగా తరలించడానికి సిద్ధం చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసు, పౌరసరఫరాల శాఖ, రెవిన్యూ అధికారుల బృందం పిఠాపురంలో ఆదివారం పట్టుకుంది. 18 బస్తాల్లో ఉన్న సుమారు 900 కేజీల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంపై అధికారులు పిఠాపురంలో దాడి చేసి పట్టుకున్నట్లు ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించామన్నారు. బియ్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు, పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వీఆర్‌లోకి నిడదవోలు సీఐ

కొవ్వూరు: ఎన్నికల కమిషన్‌కు వెళ్లిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావును వేకెన్సీ రిజర్వ్‌డ్ (వీఆర్)లోకి పంపారు. ఈ విషయాన్ని డీఎస్పీ కేసీహెచ్ రామారావు ఆదివారం రాత్రి తెలిపారు. దీనిపై ఐజీ అశోక్ కుమార్ నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. కొవ్వూరు రూరల్ సీఐ పి.శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

గుడ్డుకు వడగాడ్పు

- పౌల్ట్రీ పరిశ్రమకు భానుడి సెగ
- ఎండల తీవ్రతకు కోళ్ల మృత్యువాత
- గుడ్ల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం
- జిల్లాలో 1.40 కోట్ల లేయర్ కోళ్లు

రాయవరం: భానుడు రోజురోజుకు తన ప్రభావాన్ని చూపుతున్నాడు. భానుడి సెగకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇక చిరుప్రాణుల సంగతి చెప్పనవసరం లేదు. కోట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టి పౌల్ట్రీ ఫారమ్స్ నిర్వహిస్తున్న యజమానులకు ఎండాకాలం తీవ్ర నష్టాలను చూపే పరిస్థితి నెలకొంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు కోళ్ల మృత్యువాత పడడం ప్రారంభమైంది. ఏప్రిల్ నెల ప్రారంభంలోనే ఇలా ఉంటే మే నెలలో పరిశ్రమకు మరింత గడ్డు పరిస్థితి ఏర్పడనుందనే ఆందోళన పౌల్ట్రీ రైతుల్లో ఉంది.

1.40 కోట్ల లేయర్ కోళ్లు

జిల్లాలో 250 వరకు పౌల్ట్రీలు ఉండగా, వీటిలో 1.40 కోట్ల లేయర్ కోళ్లు ఉన్నాయి. గుడ్లు పెట్టేందుకు సిద్ధంగా ఉన్న కోళ్లు 75 లక్షల వరకు ఉంటాయి. సాధారణంగా ఏప్రిల్‌లో కోళ్ల పరిశ్రమ ఒడిదొడుకులు ఎదుర్కొంటుంది. ప్రస్తుతం మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా పౌల్ట్రీ పరిశ్రమ కష్టనష్టాలను ఎదుర్కొంటోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కోళ్ల పరిశ్రమను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో కోళ్లు మృత్యువాత పడడం ప్రారంభమైంది. ఉష్ణోగ్రతలకు తోడుగా వడగాడ్పులు అధికమైతే రోజుకు 2–3 శాతం వరకు కోళ్లు మృత్యువాత పడే అవకాశం ఉందని పౌల్ట్రీ రైతులు అంటున్నారు. గతేడాది కూడా వేసవిలో రెండు శాతం మరణాలు సంభవించాయి. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేయడంతో



పౌల్ట్రీ రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

తెగుళ్లతో సతమతం

ఏటా పౌల్ట్రీ పరిశ్రమలో కోళ్లు పలు రకాల వ్యాధులకు గురవుతుంటాయి. వ్యాక్సిన్ ఫెయిలైన సందర్భంలో ఎక్కువగా వైరస్, గంబోరా, కొరైజా తదితర వ్యాధులు వస్తుంటాయి. వేసవిలో ఎండవేడిమికి కోళ్లు చనిపోతుంటాయి. సాధారణ రోజుల్లో రోజుకు 0.5 శాతం కోళ్లు చనిపోతుంటాయి. వేసవిలో ఎండ వేడిమికి ఒక్కొక్కసారి అధిక శాతంలో మరణాలు సంభవిస్తుంటాయి.

కలవర పెడుతున్న దాణా ఖర్చులు

పౌల్ట్రీ పరిశ్రమను పెరిగిన దాణా ఖర్చులు కలవరపెడుతున్నాయి. కోళ్లకు దాణాగా అందజేసే సోయాబీన్ ధర అందుబాటులో ఉన్నప్పటికీ

గిట్టుబాటు కాని గుడ్డు ధర

పౌల్ట్రీ రైతులకు గుడ్డు ధర కూడా గిట్టుబాటు కావడం లేదు. పెరిగిన దాణా ఖర్చుల నేపథ్యంలో గుడ్డు ధర ఏడాది పొడవునా సరాసరి రూ.3.80 నుంచి రూ.4 వరకు వస్తోంది. ప్రస్తుతం గుడ్డు రేటు రూ. 3.65గా(నెక్ ధర) ఉంది. సాధారణంగా లక్ష లేయర్ కోళ్లు ఉంటే రోజుకు 80 నుంచి 85వేల గుడ్ల ఉత్పత్తి ఉంటుంది. వేసవిలో కోళ్లు దాణాను సరిగ్గా తీసుకోకపోవడంతో గుడ్డు ఉత్పత్తి సరాసరిన రోజుకు 70 నుంచి 75 వేలుగా ఉంటుందని పౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు. వేసవిలో గుడ్ల ఉత్పత్తి పడిపోవడం, కోళ్లు మృత్యువాత పడడం, దాణా ధరలు పెరిగి పోవడం పౌల్ట్రీ పరిశ్రమను తీరని ఒడిదొడుకుల్లోకి నెట్టేస్తున్నాయని పౌల్ట్రీ యజమానులు వాపోతున్నారు.

కోల్‌కతా మార్కెట్‌పైనే ఆధారం



గుడ్డు ధర మార్కెట్‌పై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా కోల్‌కతా మార్కెట్‌పైనే గుడ్డు ధర, పౌల్ట్రీ రైతుల భవితవ్యం ఆధారపడి ఉంటుంది. ఈ పరిస్థితిలో మార్పు రాకపోతే ముందు ముందు పౌల్ట్రీ రైతులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముంది.

– కర్రి రామారెడ్డి, పౌల్ట్రీ యజమాని, రాయవరం

ప్రభుత్వం ఆదుకోవాలి



పౌల్ట్రీ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలి. దాణా ధరలను నియంత్రించడంతో పాటు, రాయితీలు ఇవ్వాలి. వేసవిలో ఏటా పౌల్ట్రీ రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది కూడా ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పౌల్ట్రీ రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

– పడాల సుబ్బారెడ్డి, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అర్తమూరు, మండపేట మండలం

మొక్కజొన్న, నూకల రేట్లు ఆకాశాన్నంటుతున్నట్టు పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. టన్ను మేతకు రూ.28వేల వరకు ఖర్చవుతుండగా, ఎండ తీవ్రతకు గుడ్ల ఉత్పత్తి ఆశాజనకంగా లేదు. ఇతర ఉత్పత్తులు చేసే కంపెనీలు పెరగడం, మొక్కజొన్న ఎక్కువగా ఆ కంపెనీలకు వెళ్లిపోవడం వలన మొక్కజొన్న కోళ్ల రైతులకు అందుబాటులోని పరిస్థితి నెలకొంది. దీంతో మొక్కజొన్నకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం మొక్కజొన్న టన్ను రూ.23 వేలు పలుకుతోంది. నూకను అధికంగా మద్యం తయారీ కంపెనీలు వినియోగించడంతో డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా టన్ను నూక రూ.21వేలకు పెరిగింది. సోయాబీన్ ఉత్పత్తి బాగుండడంతో దాని ధర పౌల్ట్రీ రైతులకు అందుబాటులో ఉంది.

డ్రంక్ అండ్ డ్రైవ్ కింద శిక్ష పడితే ఓటు కట్!

అంబాజీపేట: జైలులో ఉన్న ఖైదీలకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించిన రాజ్యాంగం, ఓటు హక్కును వినియోగించుకునేందుకు మాత్రం అవకాశం కల్పించలేదు. సివిల్ కేసుల్లో జైలులో ట్రయల్స్ కింద ఉన్నవారు కూడా ఓటు వేయలేరు. అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడి పోలింగ్ రోజును జైలు శిక్ష అనుభవిస్తున్న వారికీ ఓటు హక్కు ఉండదు. పీడీ యాక్ట్ (ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్) కింద అరెస్ట్ అయి శిక్ష అనుభవిస్తున్న వారు మాత్రం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. పీడీ యాక్ట్ కింద అరెస్ట్ అయిన వారి వివరాలను ఎన్నికల సంఘం నియోజకవర్గాల వారీగా అధికారులకు పంపిస్తుంది. దీంతో పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారు ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

పిఠాపురంలో జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు



పోటీలలో గురి చూసి బాణం వదులుతున్న క్రీడాకారులు

పిఠాపురం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్చరీ పోటీలు ఆదివారం పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల ఆట స్థలంలో నిర్వహించారు. జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు జేఎస్ఎస్ గోపాలకృష్ణ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, కోచ్ లక్ష్మణరావు ప్రతిభ చూపిన క్రీడాకారులకు బహుమతులు అందజేసారు.

జీడిపప్పు పరిశ్రమ వద్ద చెలరేగిన మంటలు

గ్రామస్తులు, అగ్నిమాపక సిబ్బంది సాయంతో అదుపు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తుని రూరల్: తుని మండలం హంసవరం శివారు జీడిపప్పు పరిశ్రమ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఆదివారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. విషయం తెలియడంతో గ్రామ సర్పంచ్ రాయి మేరీఅవినాష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. రెండు రోజులుగా ఎండవేడిమి అధికంగా ఉండడం, ఉష్ణోగ్రతలు సైతం 41 డిగ్రీలు నమోదవుతుండడంతో నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. జీడిపప్పు ఫ్యాక్టరీలో రోజూ ఐదు వందల మంది పనులు చేస్తుంటారు. ఆదివారం సెలవు కావడంతో ఫ్యాక్టరీకి పనులు చేసేందుకు ఎవరు రాలేదు. ఎండ, మంటల వల్ల వెలువడిన వేడిగాలులకు ఆ ప్రాంతంలో పరిస్థితి ప్రమాదకరంగా మారిందని సర్పంచ్ మేరీ అవినాష్ చెప్పారు. సకాలంలో స్పందించడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని ఫ్యాక్టరీ నిర్వాహకులు తెలిపారు.

సీఎం జగన్ పాలనలో బీసీలకు ప్రాధాన్యం





బీసీ సదస్సులో మాట్లాడుతున్న ఎంపీలు సుభాష్ చంద్రబోస్, భరత్ రామ్, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



మండపేట బీసీ సదస్సుకు హాజరైన జనం

- రాజ్యసభ సభ్యుడు సుభాష్ చంద్రబోస్
- సంక్షేమ ఫలాలను చూసి మరోసారి అవకాశం ఇవ్వాలని పిలుపు
- మండపేటలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు ఆధ్వర్యంలో బీసీ సదస్సు
- విశేష స్పందనతో వైఎస్సార్ సీపీలో కొత్త ఉత్సాహం

కపిలేశ్వరపురం/మండపేట: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం పెరిగిందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. మండపేటలో వైఎస్సార్ సీపీ మండపేట అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన బీసీ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ మార్గాని భరత్‌కుమార్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, బీసీ సంఘాల జిల్లా నాయకులు హాజరయ్యారు. సదస్సు నిర్వహణతో మండపేట పట్టణ వీధులు బీసీ సామాజిక వర్గీయులు, వృత్తిదారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో సందడిగా మారాయి. సుమారు 15 వేల మంది హాజరైన ఈ సదస్సు ఆద్యంతం కోలాహలంగా సాగింది. దీంతో వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో కొత్త ఉత్సాహం చోటు చేసుకుంది. ఎంపీ సుభాష్ చంద్రబోసు మాట్లాడుతూ 55 శాతం బీసీ సామాజిక వర్గీయులున్నా గత ప్రభుత్వాల్లో రాజకీయ ప్రాతినిధ్యానికి దూరంగా ఉంటూ వచ్చారన్నారు. వైవిధ్య పరిస్థితులను కొన్ని పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకుంటూ బీసీలను ఓటు బ్యాంకుగా చేసుకున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన విధానాలతో బీసీలకు ఉన్నత స్థానాన్ని కల్పిస్తున్నారన్న విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావులిద్దరికీ సంపూర్ణ మెజారిటీ ఇస్తూ బీసీలంతా వారిని చట్ట సభలకు పంపించాలని కోరారు. గత చంద్రబాబు, ప్రస్తుత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిల పాలనాతీరులోని వ్యత్యాసాలను బీసీ సోదరులంతా బేరీజు వేసుకోవాలని కోరారు. బీసీలకు ప్రభుత్వ పరంగా అందిన లబ్ధినే ప్రామాణికంగా ఆలోచించాలని కోరారు. ఇచ్చిన మాట నిలుపుకోకపోతే రాజకీయ నాయకులకు ఈ దేశంలో గౌరవం పోతుందని మాలాంటి వారికి సీఎం జగన్ ఎప్పుడూ చెబుతుంటారన్నారు. 643 హామీలిచ్చిన చంద్రబాబు 600 హామీలను గాలికి వదిలేశారన్నారు. సీఎం జగన్ నూటికి నూరు శాతం హామీలను అమలు చేశారన్న విషయాన్ని గమనించాలన్నారు. మండపేట నియోజకవర్గంలో డబ్బు, మద్యంను ప్రతిపక్షాలు నాయకులు ఆయుధాలుగా కలిగి ఉన్నారు. బీసీ సోదరులంతా ఐక్యతను ప్రదర్శిస్తూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ, అభివృద్ధి ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు.

ఎంపీ మార్గాని భరత్‌కుమార్ మాట్లాడుతూ మండపేట నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల్లో టీడీపీ కంచుకోటను బద్దలు కొట్టిన చరిత్ర ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు దక్కుతుందన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు కల్లబొల్లి మాటలు చెప్పి కుర్చీ ఎక్కాడని, తర్వాత అన్నీ గాలికి వదిలేసిన అనుభవాలను ప్రజలంతా చూశారన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ వాగ్దానాన్ని అమలు చేసి చూపించి ఆంధ్ర రాష్ట్రంలో చరిత్ర సృష్టించారన్నారు. ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవులు, పార్టీ పదవుల్లో సీఎం జగన్ బీసీలకు అగ్రస్థానాన్ని కట్టబెట్టారన్నారు.

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడంలో వైఎస్సార్ కుటుంబం కీలక పాత్ర పోషించిందన్నారు. అలాంటి కుటుంబానికి ఈ జిల్లాలోని బీసీ సామాజిక వర్గీయులంతా అండగా నిలవాలన్నారు. కోనసీమలో తోట త్రిమూర్తులు ఎప్పుడూ ఇతర కులాల పట్ల మైత్రి భావంతో మెలిగారన్నారు. ఆయన జీవితమంతా బీసీల పక్షపాతిగానే గడిచిందన్నారు.

ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ మండపేట నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల్లో పెత్తందార్ల పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. బీసీ సామాజిక వర్గీయులు ఎప్పుడూ రాజకీయ చైతన్యంతో నిర్ణయం తీసుకుంటారని, రానున్న ఎన్నికల్లో టీడీపీ దుష్టచతుష్టయానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికలు అత్యంత కీలకమైనవని, బీసీ సామాజిక వర్గీయులకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు, ఎంపీ అభ్యర్థినైన తనకూ ఓటు వేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను మరోసారి తెచ్చుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు



నుజ్జునుజ్జు అయిన ఆటో

ముమ్మిడివరం: పెళ్లి బృందంతో వెళుతున్న ఆటోను వెనుక నుంచి ట్రక్కు ఆటో ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు ప్రయాణికులతో పాటు డ్రైవర్ గాయపడ్డాడు. నగర పంచాయతీ శివారు బొండాయికోడు పెట్రోలు బంక్ వద్ద 216 జాతీయ రహదారిపై ఆదివారం ఈ ప్రమాదం జరిగింది. ఉప్పలగుప్తం మండలం కూనవరం నుంచి యానాంలో జరిగే శుభ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆరుగురు మహిళలు, ఒక వ్యక్తితో వెళుతున్న ఆటోను వెనక నుంచి ట్రక్ ఆటో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆటో నుజ్జు నుజ్జు అవటంతో ఆటోలో ప్రయాణిస్తున్న కూనవరానికి చెందిన నేలపాటి రమేష్‌బాబు, బడుగు రాజేశ్వరి, నేలపాటి లోవకుమారి, చల్లపల్లికి చెందిన కాగిత దుర్గారత్నం, బుంగా నరసమ్మ, కిత్తన చెరువుకు చెందిన జొన్నాడ ధనలక్ష్మి గాయపడ్డారు. గాయపడిన వారిని అమలాపురం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దుర్మరణం

కరప: మండలంలోని నడకుదురు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నడకుదురు సిద్ధార్థనగర్ కాలనీకి చెందిన గుండుపల్లి సత్తిబాబు సోదరి నక్కాదేవి కువైట్‌లో ఉద్యోగం చేస్తోంది. ఆమె కుమారుడు నక్కా ఇసాక్‌కుమార్(23) తన మేనమామ సత్తిబాబు వద్ద ఉంటున్నాడు. ఇసాక్‌కుమార్ మానసిక స్థిమితం సరిగాలేకపోవడంతో కాకినాడ, విశాఖలలోని ప్రభుత్వాసుపత్రులలో చికిత్స చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇసాక్‌కుమార్ ఆదివారం తెల్లవారు జామున నడకుదురు కాలువలో స్నానం చేసి వస్తానని చెప్పి, బయటకు వచ్చాడు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్దకు వచ్చే సరికి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి, ఆగకుండా వెళ్లి పోయింది. ఇసాక్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మేనమామ సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఏఎస్ఐ వి.సూరిబాబు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఓలలాడించిన కవి కోయిలలు

- విశేషంగా అలరించిన ఉగాది సాహితీ సభ, కవి సమ్మేళనం
- కవి సుబ్బారావుకు కవితలను అంకితమిచ్చిన పలువురు కవులు



కొత్తపేట ఉగాది సాహితీ సభలో కవి సుబ్బారావును సత్కరిస్తున్న ప్రముఖులు



నాని రాజును సత్కరిస్తున్న శ్రీశ్రీ కళావేదిక జాతీయ చైర్మన్ ప్రతాప్ తదితరులు

కొత్తపేట: ఉగాదికి ముందే కవి కోయిలలకు కొత్తపేట వేదికయ్యింది. 36 సంవత్సరాలుగా కొత్తపేటలో కళాసాహితి ఆధ్వర్యంలో ఉగాది సాహితీ సభ, కవి సమ్మేళనం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది ఉగాదికి ముందే ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనంలో కళాసాహితి అధ్యక్షుడు పెన్మెత్స హరిహరదేవళరాజు నిర్వహణలో ప్రధాన కార్యదర్శి గిడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో కార్యదర్శి యేడిద సత్తిరాజు అధ్యక్షతన జరిగిన సభలో తెలుగు విశ్వవిద్యాలయం 'కీర్తి' పురస్కార గ్రహీత, దాట్ల దేవదానం రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

సామాజిక స్పృహతో రాసే కవిత్వం సజీవం

సామాజిక స్పృహతో కవిత్వం రాస్తే సమాజంలో ఎప్పుడూ బతికి ఉంటుందని దేవదానంరాజు అన్నారు. విమర్శకుడు గిడ్డి సుబ్బారావు మాట్లాడుతూ నేడు కవిత్వం కొత్త పుంతలు తొక్కుతోందని ఇది ఆహ్వానించదగిన పరిణామం అన్నారు. సాహితీ లోకంలో కొత్తపేట కళాసాహితి ద్వారా క్రమం తప్పకుండా ఉగాది కవిసమ్మేళనాలు, సాహితీ సభలతో సాహితీ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన గిడ్డి సుబ్బారావును అభినందించారు. పలువురు తమ రచనలు, కవిత్వాలను ఆయనకు అంకితమిచ్చారు. అనంతరం ప్రముఖ కవులు ఎస్ఆర్ పృథ్వి, డాక్టర్ గూటం స్వామి, వీఎస్సార్ఎస్ సోమయాజులు, ఏబీసీ దేవ్, షేక్ గౌస్, షేక్ ఖాజామొహిద్దీన్ తదితర సుమారు 60 మంది తమ కవితలు వినిపించి శ్రోతలను అలరించారు.

కవి సుబ్బారావుకు ఘన సన్మానం

36 ఏళ్లుగా సాహితీ సేవ చేస్తున్న జి.సుబ్బారావును సాహితీవేత్తల చేతుల మీదుగా సత్కరించారు. దివంగత కవి అద్దంకి కేశవరావు 50వ దశకంలో రచించిన 'పడవ గది తెచ్చిన పరివర్తన', 'అకేరా కమ్మని కథలు' పుస్తకాలను కేశవరావు కుమారుడు బుద్ధచంద్రదేవ్ కవులు, సాహితీ ప్రియులకు అందచేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన శిల్పి డి. రాజ్‌కుమార్ వుడయార్, విద్యాబాలమందిర్ కరస్పాండెంట్ ఆర్‌కే ఆచార్యులుకు సభ కృతజ్ఞతలు తెలియచేసింది.

వైభవంగా కవి సమ్మేళనం

అమలాపురం రూరల్: స్థానిక లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం శ్రీశ్రీ కళావేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో 132 మందితో కవి సమ్మేళనం వైభవంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు నుంచి పాల్గొని కవితలను గానం చేశారు. ముఖ్య అతిథిగా ప్రతాప్ మాట్లాడుతూ సామాజిక అభివృద్ధికి సహాయపడే సాహిత్యం అభ్యుదయ సాహిత్యం అవుతుందన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన శ్రీ శ్రీ కళావేదిక కోనసీమ జిల్లా శాఖ గౌరవ అధ్యక్షుడు రుద్రరాజు వెంకటరాజు (నాని రాజు) పాల్గొన్నారు. జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి మాట్లాడుతూ కవిత్వంలో బలంగా చెబితే హృదయానికి హత్తుకుంటుందన్నారు. జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టి లలిత, శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నల్లా నరసింహమూర్తి మాట్లాడారు. సభకు జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ టీ. పార్థసారథి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డేబా విజయకుమార్, అరవ జయపాల్, జిల్లా రాష్ట్ర అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి జిల్లా నూతన కార్యవర్గాన్ని సభకు పరిచయం చేశారు. జిల్లా కమిటీ సభ్యులు పోలిశెట్టి అనంతలక్ష్మి, కుంపట్ల సుభాషిని డాక్టర్ వై.టీ.పీ వెంకటేష్ అరిగెల బలరామమూర్తి, జల్లి సుజాత, శ్రీ గిరి పద్మావతి శ్రీగిరి గోపాలకృష్ణ, గుర్రం రామకృష్ణారావు, కడలి సత్యనారాయణ,పాల్గొన్నారు. కవులను సన్మానించారు.

సాక్షి ఫ్యామిలీ
IV
రాజమహేంద్రవరం
సోమవారం ॥ 8-4-2024

మంచిమాట



తానెంతో జగమంత

ప్రతిమనిషి, సరిగా చెప్పాలంటే ప్రతి జీవి ప్రపంచం అంతా తన వంటిదనే అనుకుంటుంది. తన దృష్టికోణం లోనే చూస్తుంది. అందుకే అబద్ధాలాడేవారికి అందరూ అబద్ధాలు చెపుతారనే అభిప్రాయమే ఉంటుంది. ఎవరి మాటనీ ఒక పట్టాన నమ్మరు. తాను అబద్ధం చెప్పనప్పుడు ఎదుటివారు అబద్ధం చెపుతున్నారేమో అనే అనుమానం ఎందుకు వస్తుంది? పైగా తను చెప్పేది నిజం అని నమ్మమని ఒకటికి పదిసార్లు నొక్కి వక్కాణిస్తూ ఉంటారు. అవతలి వారు నమ్మరేమో ననే సందేహం ఎందుకు వస్తుంది? తాను చెప్పే మాట మీద తనకే నమ్మకం లేదు కనుక.

ఇతరులని మోసం చేసే గుణం ఉన్న వారు ఇతరులు తమని మోసం చేస్తారేమో నని భయపడుతూనే ఉంటారు. మోసం చేసే బుద్ధి తనకి లేక పోతే ఎదుటి వారు తనని మోసం చేస్తారేమో ననే అనుమానం కూడా రాదు. పరాయి ఆడపిల్లలని చెడుదృష్టితో చూసేవారు తమ ఇంటి ఆడవారిని బయటకు పంపటానికి ఇష్టపడరు. దీనికి పెద్ద ఉదాహరణ రావణుడే. కనపడిన ప్రతి స్త్రీని కామదృష్టితో చూసి, చేజిక్కించుకోవాలనుకునే గుణం ఉన్నవాడు కనుకనే తన భార్యలని కట్టడిలో ఉంచాడు. మేలిముసుగు లేకుండా వారిని బయటికి రానిచ్చేవాడు కాదు. ఆ విషయాన్ని రావణ వధానంతరం యుద్ధభూమిలో పడి ఉన్న రావణుణ్ణి చూసి మండోదరి ''మేలిముసుగు లేకుండా నీ భార్యల మైన మేము ఇక్కడికి వస్తే ఏమి అనటం లేదేమి?'' అని ప్రశ్నించటంలో తెలుస్తుంది. అదే రావణుడు తన చెల్లెలు శూర్పణఖ విషయంలో అవేవీ పాటించ నక్కర లేదని చెప్పి స్వేచ్ఛగా వదిలేశాడు. రాక్షసవంశంలోనే పుట్టిన ప్రహ్లాదుణ్ణి ''కన్నుదోయి కన్యకాంత లడ్డం బైన మాతృభావము చేసి మరలువాడు'' అని పోతనామాత్యుల వారు వర్ణించారు. స్త్రీల పట్ల సద్భావం కలవాడు కనుక తన తల్లిని, ఇతర స్త్రీలని కూడా గౌరవభావంతో చూడటం తటస్థించింది.



జంతువులన్నీ ఇతర జంతువులు, ముఖ్యంగా మనుషుల మీద దాడి చేయటానికి కారణం వాటికి ఉన్న అభద్రతా భావం. అవి ఎదుటి జంతువులని తినటమో, బాధించటమో చేస్తాయి కనుక ఎదుటి జంతువులు కూడా తమని బాధిస్తాయేమోనని ఎదురు దాడి చేస్తాయి. నాగుపాముని చూస్తే ఈ విషయం బాగా అర్థమౌతుంది. మంచి జాతి సర్పం ఎదురు పడగానే మనిషి భయపడితే అది కూడా భయ పడుతుంది. దాని వంక ప్రేమగా, లేక భక్తితో చూస్తే అది కూడా అదే భావంతో చూసి తొలగిపోతుంది. అందుకే త్రాచు పాము కనపడగానే చేతులు జోడించి నమస్కారం చేసి కదల కుండా ఉండమని చెపుతారు. తేలుకి ఎదుటి ప్రాణి తనని బాధిస్తుందనే సందేహం ఉంటుంది కనుక ఏది అడ్డు తగిలితే దానిని కుట్టుకుంటూ పోతుంది. ఇటువంటి లక్షణాలే మనుషులలో కూడా కనిపిస్తాయి. అకారణంగా ఇతరులని బాధించేవారు, భయం వల్లనే బాధిస్తారు. పచ్చకామెర్ల రోగికి లోకం అంతా పచ్చగా కనిపిస్తుంది కదా!

అదేవిధంగా ''ఆత్మవత్ సర్వభూతాని'' అని భావించి ఎదుటివారి కష్టం తనది భావించి తదనుగుణంగా స్పందించేవారు, ఎవరికి మేలు కలిగినా తమకే కలిగి నంతగా సంతోషించేవారు ఉన్నారు. ఎవరికి ఆపద కలిగినా వీరి కళ్ళలో నీళ్ళు వస్తాయి. ఎవరికి మంచి జరిగినా వీరు పండగ చేసుకుంటారు. అంటే, ఈ కోవకి చెందిన వారు జంతు ప్రవృత్తి నుండి కొంత ఎదిగినట్టు చెప్పవచ్చు.

ఈ విధంగా ఉండి అందరు తన లాగానే ఉంటారు అనుకోవటం వల్ల లౌకికంగా నష్టపోయిన వారూ ఉన్నారు. కాని, మానవతా దృక్పథంలో వారు ఉన్నత స్థానానికి చేరుకున్నారని అర్థం. ప్రతిస్పందన కన్న సహ అనుభూతి ఉత్తమ స్థాయి.

– ఎన్. అనంతలక్ష్మి

తాత్త్వికథ

చెట్టునీడ



ఒకరోజు జ్ఞాని దగ్గరకు కోటీశ్వరుడు వెళ్లి స్వామి నా దగ్గర కోటానుకోట్ల డబ్బు ఉన్నది. పూర్తి ఆరోగ్యవంతుడిని. ఇక నేను ఎవరిపైనా ఆధారపడవల్సిన అవసరం లేదు. ఎవరినీ సహాయం చేయమని అర్థించాల్సిన అవసరం లేదని చాలా గొప్పగా చెప్పుకున్నాడు.

ఆ మాటలు విన్నాక జ్ఞాని నవ్వుతూ ''బాబు నాతో కాస్త దూరం నడవగలవా'' అని అడిగాడు. అయన ఆలా అడగడంతో నిరాకరించడం బాగుండదని తల చిన ఆ వ్యక్తి జ్ఞానితో కలిసి అడుగులు వేశాడు.

అలా నడుస్తూ నడుస్తూ అలసిపోయిన వ్యక్తి దరిదాపులలో ఏదైనా చెట్టు కనిపిస్తుందేమో... ఆ చెట్టు నీడలో కాసేపు సేద తీరాలని చుట్టూ చూసాడు. ఎక్కడా ఏ చెట్టూ కనిపించలేదు.

ఇది గమనించిన జ్ఞాని ''ఏంటి బాబూ... వెతుకుతున్నావు?'' అని అడిగాడు.

''అయ్యా చాల దూరం వచ్చాము. కాసేపు చెట్టునీడలోకి వెళ్లి సేదతీర్చుకుని ఆ తర్వాత తిరిగి ముందుకు సాగుదాం''అని చెప్పాడు.

అతడి మాటలకు ఆ జ్ఞాని ''చెట్టునీడ నీకెందుకు బాబూ... నీ నీడలో నువ్వు సేద తీర్చుకో'' అన్నాడు.

''నా నీడలో నేను ఎలా ఉండగలను స్వామీ! ఏం మాట్లాడుతున్నారు మీరు?'' అని కాస్తంత ఆశ్చర్యంగా మరి కాస్త నిష్ఠురంగానూ అడిగాడు ఆ వ్యక్తి.

అందుకు ఆ జ్ఞాని, చిరునవ్వుతో అతడి వైపు చూస్తూ... అదేంటి, నీ నీడలో నువ్వు తల దాచుకోలేవా? నువ్వే కదా బాబూ, నాదగ్గర అన్నీ ఉన్నాయి. నేను ఎవరిని ఆశ్రయించాల్సిన అవసరం లేదు అన్నావు, చూశావా! ఇప్పుడు నీ నీడ సైతం నీకు ఉపయోగపడలేదు'' అన్నారు.

ఇప్పుడు ఆ ఐశ్వర్యవంతుడికి నిజంగా జ్ఞానోదయం అయింది ఏ చెట్టు కిందకూ వెళ్ల కుండానే.

అందుకే పెద్దలన్నారు... అహంకరించవద్దు అని. ఎంత ధనవంతులైనా, వారికి ఎన్ని ఉన్నా ఎప్పుడు ఎవరికీ ఏది అవసరం అవుతుందో తెలియదు ఈ లోకంలో.

అన్నింటికీ మించి మనపైన మనకు నమ్మకం ఉండాలి అహం ఉండకూడదు. మన పైన మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. అతేకానీ, ఇతరులపైన ఏమాత్రం చులకన భావం ఉండ కూడదు... మనసులోకి రాకూడదు.

గృహస్థాశ్రమ విశిష్టత

పెళ్ళి... ఇద్దరి మధ్య వ్యవహారం కాదు



కోటలో యుద్ధం చేయడం గృహస్థాశ్రమం. కోట బయట చేసేవి ఇతర ఆశ్రమాలు. అవి జన్మతః వైరాగ్యం కలిగిన మహాపురుషులకే సాధ్యం. ఎన్నో జన్మల అనుష్ఠాన బలం వారిది. వారు కారణజన్ములు. చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారు, చంద్రశేఖర భారతీ మహాస్వామివారు, ఒక రామకృష్ణ పరమహంస, ఒక వివేకానందుడు, అరుణాచల భగవాన్ రమణులు... ఇటువంటివారు ఎక్కడో కోట్లలో ఒకరుంటారు.

కానీ అందరికి అందుబాటులో ఉండేది, అర్థకామములను ధర్మం తో ముడివేసుకోవడానికి యోగ్యమైనది – గృహస్థాశ్రమం. దీని ప్రవేశం... కేవలం ఒక పురుషుడికో, ఒక స్త్రీకో సంబంధించినది కాదు. అంటే పెళ్ళి ఎప్పుడూ పూర్తిగా వ్యక్తిగత విషయం కానే కాదు. ఇక్కడ సక్రమంగా ప్రవర్తించకపోతే... దాని చెడు ప్రభావం సమాజం మీద పడుతుంది. కచ్చితంగా మూడవ వ్యక్తి మీద అది ప్రభావం చూపి తీరుతుంది. అదే దంపతులిద్దరూ అన్యోన్యంగా బతకగలిగితే... మూడవ వ్యక్తికి ఆదర్శంగా నిలుస్తారేమో గానీ, సమాజాన్ని అది చెడుగా ప్రభావితం చేసే అవకాశమేలేదు.

వాళ్ళిద్దరూ పుట్టుకనుంచి కలిసి ఉన్నవారు కాదు, కలిసి చదువుకోలేదు, కలిసి బతకలేదు. అకస్మాత్తుగా ఇద్దరు కలుసుకుని జీవిత ప్రయాణానికి, ఒక ఆశ్రమ నియమానికి కట్టుబడటానికి సిద్ధమవుతున్నారు. మనం ఒక ఉద్యోగంలో చేరితేనే... సవాలక్ష నియమాలకు అంగీకరించినప్పుడే దానిలో కొనసాగగలం. అటువంటిది ఒక జీవితకాలం పూర్తిగా కలిసి ఇద్దరూ ప్రయాణించాలి. పుట్టిన సంతానానికి మార్గదర్శకంగా నిలవాలి... అంటే దానికి ఎంతో పరిణతి ఉండాలి. జీవితం అంటే పూలపడవ కాదు కదా... వెలుతురు, చీకటి, కష్టాలు, సుఖాలు... అన్నింటినీ చక్కగా సమన్వయంతో, అవగాహనతో ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా వంశాభివృద్ధి చేసుకుంటూ సంసారనావను నడపాల్సి ఉంటుంది. అటువంటి సంసారంలో మంచి జరిగినా, చెడు జరిగినా అది సమాజాన్ని సానుకూలంగా కానీ, ప్రతికూలంగా కానీ ప్రభావితం చేస్తుంటుంది. అందుకే పెళ్ళి ఎప్పుడూ ఇద్దరి మధ్య వ్యవహారం కాదు.

ధర్మం, కామం, అర్థం సమంగా ఉంటే... మోక్షం అనేది కొత్తగా ప్రయత్నించి తెచ్చుకోనక్కర లేదు. అదే వస్తుంది. అంటే ధర్మబద్ధమైన అర్థం, ధర్మబద్ధమైన కామం ఉండాలి. నేను డబ్బు సంపాదిస్తే ధార్మికంగా సంపాదించానా ? ఖర్చుపెడితే.. ధర్మంకోసం ఖర్చు పెట్టానా? నాకు మనసులో ఒక కోరిక పుడితే ఇది ధర్మచట్రంలో ఇముడుతుందా? దీనిని నేను నెరవేర్చుకోవచ్చా? ... ఈ పరిశీలన అలవాటయితే అర్థం. కామం ధర్మానికి ముడిపడిపోయినట్టే. సామాన్యులకు కూడా ప్రయోజనం చేకూరాలని మన రుషులు ప్రవేశపెట్టిన మార్గం ఇది.. అదే గృహస్థాశ్రమం.

గృహస్థు అంటే కేవలం ఒక గృహంలో ఉన్నవాడని కాదు. గృహస్థాశ్రమ స్వీకారం చేశాడు... అంటే ధర్మాన్ని స్వీకరించాడు.. అని. తరువాత నిత్యకర్మ చేయకుండా ఎలా ఉంటాడు? అది సాధ్యం కాదు. ఏదో కర్మ చేయవలసిందే. దీనివల్ల చివరకు ప్రత్యేకంగా ప్రయత్నించకపోయినా మోక్షమే కలుగుతుంది. జ్ఞానాన్ని ఇచ్చిన భగవంతుడు మోక్షాన్ని కూడా ప్రసాదిస్తాడు.

రామాయణంలో భరతుడు ఒక మాటంటాడు. నాలుగు ఆశ్రమాలలోకి గృహస్థాశ్రమం శ్రేష్ఠమైనది –అని. అంతకన్నా గొప్పది మరొకటి లేదు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

వార్‌కు రెడీ!


● ఎన్టీఆర్

బాలీవుడ్ 'వార్'కు రెడీ అవుతున్నారు ఎన్టీఆర్. హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'వార్ 2'. 2019లో హిట్‌గా నిలిచిన హిందీ చిత్రం 'వార్'కు సీక్వెల్‌గా 'వార్ 2' తెరకెక్కుతోంది. 'వార్'కి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించగా, 'వార్ 2'కు 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఇప్పటికే 'వార్ 2' చిత్రీకరణ మొదలైందని, హృతిక్‌రోషన్ పాల్గొనగా కొంత చిత్రీకరణ కూడా జరిపారని టాక్. కాగా ఈ వారంలో 'వార్ 2' సెట్స్‌లో ఎన్టీఆర్ జాయిన్ అవుతారని బాలీవుడ్ సమాచారం. ఎన్టీఆర్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా కనిపిస్తారని టాక్. 'వైఆర్ఎఫ్' (యశ్‌రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న ఈ సినిమాను ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్నారు. 'వార్ 2' చిత్రాన్ని వచ్చే ఏడాది ఆగస్టు 14న విడుదల చేయనున్నట్లుగా ఇప్పటికే చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

చలో రాజమహేంద్రవరం


● రామ్‌చరణ్


'గేమ్‌చేంజర్' కోసం రాజమహేంద్రవరం వెళ్లనున్నారట రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గేమ్‌చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, అంజలి, ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, నవీన్‌చంద్ర, ప్రియదర్శి, జయరాం, సునీల్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ రాజమహేంద్రవరంలో జరగనుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. రామ్‌చరణ్‌తో పాటు ముఖ్యతారాగణం పాల్గొనే ఈ షెడ్యూల్ ఈ నెలాఖరులో ప్రారంభం కానుందని తెలిసింది. కథ రీత్యా సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాలను చిత్రీకరిస్తారట శంకర్. రాజమహేంద్రవరం షెడ్యూల్ పూర్తయిన తర్వాత వైజాగ్‌కు వెళ్తారట యూనిట్. తమన్ ఈ సినిమాకు స్వరకర్త. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.. రిలీజ్ డేట్‌పై త్వరలోనే స్పష్టత రానుంది.

అక్టోబర్‌లో వేట్టయాన్


● రజనీకాంత్

అక్టోబర్‌లో థియేటర్స్‌కు వస్తున్నాడు 'వేట్టయాన్'. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మూవీ 'వేట్టయాన్'. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్, జీకేఎమ్ తమిళ కుమరన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబరులో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో రజనీకాంత్ ఓ పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్, కిషోర్, రితికా సింగ్, దుషార విజయన్ ఇతర పాత్రల్లో నటిస్తున్న 'వేట్టయాన్' సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీత దర్శకుడు.

పవర్‌ఫుల్ పాత్రలో...


● జగపతి బాబు

రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అన్నది ట్యాగ్‌లైన్. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ మూవీలో కీలక పాత్రలో నటిస్తున్న జగపతిబాబు లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. చెస్ మూవ్‌ని చేతిలో పట్టుకొని సీరియస్‌గా చూస్తున్న లుక్ బాగుంది. ''మిస్టర్ బచ్చన్'లో జగపతి బాబు పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుంది. రవితేజ, జగపతిబాబులను తెరపై చూడటం కనుల పండువగా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సమర్పణ: పనోరమా స్టూడియోస్, టీ సిరీస్, సంగీతం: మిక్కీ జె. మేయర్, కెమెరా: అయనంక బోస్.

పెళ్లి పేరుతో మోసం చేశాడు

– సన్నీలియోన్



'ఓ వ్యక్తి ప్రేమ, పెళ్లి పేరుతో నన్ను మోసం చేశాడు' అన్నారు బాలీవుడ్ నటి సన్నీలియోన్. హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మరాఠీ, బెంగాలి, మలయాళ భాషల్లోని పలు చిత్రాల్లో ప్రత్యేక పాటలతో పాటు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించి తనకంటూ ఓ గుర్తింపు సొంతం చేసుకున్నారు ఈ బ్యూటీ. 'కరెంట్ తీగ (2014) సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన సన్నీలియోన్ 'పీఎస్‌వీ గరుడవేగ', 'జిన్నా' వంటి సినిమాల్లో నటించారు. ప్రస్తుతం ఆమె 'రంగీలా', 'వీరమదేవి', 'కొటేషన్ గ్యాంగ్', 'షీరో', 'కోకా కోలా', 'యువ' వంటి చిత్రాలతో బిజీగా ఉన్నారు. అదేవిధంగా 'స్ప్లిట్స్ విల్లా' అనే ఓ రియాలిటీ షోకి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు సన్నీ. తాజాగా ఈ షోలో ఆమె మాట్లాడుతూ–''కొన్నేళ్ల క్రితం ఒక వ్యక్తిని చాలా ప్రేమించాను. తను కూడా నన్ను ప్రేమించాడు. మా ఇద్దరికీ నిశ్చితార్థం కూడా జరిగింది. ఆ తర్వాత ఏదో తప్పు జరుగుతోందని, అతడు నన్ను మోసం చేస్తున్నాడేమోనని నా మనసుకు అనిపించింది. దీంతో 'నువ్వు నన్ను ఇంకా ప్రేమిస్తున్నావా?' అని ప్రశ్నిస్తే లేదన్నాడు. మరో రెండు నెలల్లో మా పెళ్లిని ప్లాన్ చేసుకున్నాం. హవాయి దీవుల్లో గ్రాండ్‌గా, జీవితాంతం గుర్తుండిపోయేలా వివాహం జరగాలని ప్లాన్ చేసుకున్నాం. ఇందుకోసం అన్నీ బుక్ చేసుకుని డబ్బులు కూడా ఇచ్చేశాను. పైగా పెళ్లి షాపింగ్ కూడా అయిపోయింది. ఇలాంటి సమయంలో తను అలా చెప్పడంతో నా మనసు ముక్కలైంది.. ఎంతో బాధపడ్డాను. ఆ తర్వాత భగవంతుడు నా జీవితంలో అద్భుతమైన మార్పులు తీసుకు వచ్చాడు. డానియల్ వెబర్‌ను పరిచయం చేశాడు. నా తల్లితండ్రులు చనిపోయినప్పుడు తను ఎంతో అండగా నిలిచాడు. మా ఇద్దరి మనసులు కలవడంతో పెళ్లి(2011) చేసుకున్నాం. ఎప్పటికీ నా భర్త చేయి వదలను'' అన్నారు.

అది రహస్యం కాదు!


● అదితీరావ్, సిద్ధార్థ్

''నేను, అదితీరావ్ హైదరీ కలిసి రహస్యంగా నిశ్చితార్థం చేసుకున్నామని చాలామంది అంటున్నారు. సీక్రెట్, ప్రైవేట్ అనే పదాలకు ఎంతో తేడా ఉంది. ఎవర్నీ పిలవకుండా, ఎవరికీ చెప్పకుండా చేసుకుంటే అది సీక్రెట్ అవుతుంది. కానీ, మా ఇరు కుటుంబసభ్యులతో కలిసి మేము ప్రైవేట్ ఫంక్షన్ చేసుకున్నాం. మా వారి సమక్షంలో జరిగిన నిశ్చితార్థం సీక్రెట్ ఎలా అవుతుంది'' అన్నారు హీరో సిద్ధార్థ్. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావు హైదరీ మార్చి 17న వనపర్తి జిల్లాలోని శ్రీరంగపురంలోని ఆలయంలో నిశ్చితార్థం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ వేడుకలో పాల్గొన్న సిద్ధార్థ్‌కి నిశ్చితార్థం ఎందుకు రహస్యంగా చేసుకున్నారు? పెళ్లెప్పుడు? అనే ప్రశ్నలు ఎదురయ్యాయి. దీనికి సిద్ధార్థ్ స్పందిస్తూ– ''నా ప్రేమ విషయాన్ని తొలిసారి అదితీరావుకి చెప్పినప్పుడు తన నుంచి ఏం జవాబు వస్తుందా? అని ఎదురుచూశాను. కానీ, తను నా ప్రేమను అంగీకరించడంతో చాలా సంతోషపడ్డాను. ఇక మా పెళ్లి ముహూర్తం నా చేతుల్లో లేదు.. మా ఇరుకుటుంబ పెద్దలు నిర్ణయిస్తారు'' అన్నారు సిద్ధార్థ్.

ఎమోషనల్ థ్రిల్లర్


● వరలక్ష్మి

విలక్షణ నటి వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన పాన్ ఇండియా చిత్రం 'శబరి'. ఈ మూవీ ద్వారా అనిల్ కాట్జ్ దర్శకుడిగా పరిచయవుతున్నారు. మహర్షి కూండ్ల సమర్పణలో మహా మూవీస్ పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో నిర్మించారు. ఈ సినిమాని మే 3న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ–''స్ట్రాంగ్ ఎమోషనల్ థ్రిల్లర్ చిత్రమిది. కథ, కథనాలు ఇన్నోవేటివ్‌గా ఉంటాయి. వరలక్ష్మి నటించిన గత సినిమాలకు పూర్తి భిన్నంగా 'శబరి' ఉంటుంది. ముఖ్యంగా ఆమె నటన వావ్ అనేలా ఉంటుంది. తెలుగు, తమిళ వెర్షన్స్ ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. అన్ని భాషల ప్రేక్షకులకు నచ్చే చిత్రమిది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రాహుల్ శ్రీవాత్సవ, నాని చమిడి శెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సీతారామరాజు మల్లెల, సంగీతం: గోపీ సుందర్.

రైతు గంగమ్మ


● పార్వతి

విక్రమ్ హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటించారు. పా. రంజిత్ నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. కాగా ఆదివారం(ఏప్రిల్ 7) పార్వతీ తిరువోతు బర్త్ డే. ఈ సందర్భంగా 'తంగలాన్' లో ఆమె నటించిన గంగమ్మ పాత్ర ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. లుక్ చూస్తే మహిళా రైతు పాత్రలో ఆమె నటించినట్లు తెలుస్తోంది. ''కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో వాస్తవ ఘటనలతో 'తంగలాన్' రూపొందింది. విక్రమ్‌ని విభిన్నమైన క్యారెక్టర్‌లో చూపించబోతున్నారు పా.రంజిత్. త్వరలోనే ఈ సినిమాని విడుదల చేయనున్నాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.